అమ్మాయిని చూస్తే నచ్చలేదా?" కళ్ళద్దాలు సరిచేసుకుంటూ అడిగాడు మేనమామ.

క్రిష్ణ గొంతు సర్దుకున్నాడు. ధైర్యం పుంజుకున్నాడు. "నాకు కన్పించిన కారణం పైకి చెప్పే ధైర్యం లేకపోయింది ఇప్పటిదాకా. కానీ నువ్వు చెప్పినట్టు చెమట మచ్చల బనీను, ఒక సంబంధాన్ని చెడగొట్టిందంటే, నా మనసులో మాట చెప్పెయ్యటానికి నాకూ ధైర్యం వస్తోంది. ఆ అమ్మాయి సోఫాలో కూర్చుంది బాగానే వుంది. ఆ కాళ్ళూపటం ఏమిటి బాబూ? అస్తమానూ కాళ్ళూపటమే! బట్టల మిషను తొక్కే అలవాటో, ఏమిటో! పెళ్ళి చూపుల్లో అలాగా ప్రవర్తించటం? తలవొంచుకుని సిగ్గుపడి పోవాలని నేననడం లేదు. ఆ అమ్మాయి అలా కాళ్ళు ఊపుతోంటే నా మనస్సు అసహ్యంతో నిండిపోయింది. ఇక ఆ అమ్మాయి అందచందాలు నాకేం కన్పించలేదు. ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చుని బయటపడ్డాను. చూసీ చూడగానే అసహ్యం వేసిన పిల్లని ఎలా పెళ్ళి చేసుకోనూ? రేపట్నించీ ఆ కాళ్ళు నా ముందే ఊపదూ?" అంటూ ఎదురు ప్రశ్న వేశాడు.

అంతా కుదిరిందనుకున్న సంబంధం అలా అయిపోయినందుకు తల్లికి బాగా కోపం వొచ్చింది.

"నువ్వు వొప్పుకోకపోతే ఆ పిల్లకి పెళ్ళవదనుకుంటున్నావా?" అంది వెటకారంగా.

కొడుకు కొంచెం నవ్వాడు — "నేనలా అన్నానా? ఆ అమ్మాయి ఏ పెళ్ళి చూపుల్లో అయినా కాళ్ళూపడం మానదు. 'కాళ్ళూపే భార్య కావాల'ని కోరుకునే వాళ్ళు ఆ అమ్మాయి దొరకడం అదృష్టంగా భావిస్తారు! నా సంగతే నేను చెప్పాను. నా కిష్టం లేదన్నాను. నా ఇష్టం నాది."

ఎవ్వరూ జవాబు చెప్పలేదు.

మేనమామ చిరునవ్వుతో చూశాడు.

['కరుణామయి' మాస పత్రికలో 1965 ప్రాంతాల్లో కావచ్చు.] ★

**ఈ కథ గురించి:** కాళ్ళు ఊపే వాళ్ళనీ, స్నానాలు చెయ్యని వాళ్ళనీ, అన్నాలు తింటూ తెగ చప్పుళ్ళు చేసేవాళ్ళనీ, .... ఇంకా అలాంటి మేళాన్ని పెళ్ళిళ్ళు చేసుకోకూడదని చెప్పాలని తెగ తాపత్రయం పుట్టి, ఈ కథ రాశాను. నా కోసం అంతా ఈ కథలోకి రాలేదు. కానీ వాళ్ళు ఎలాంటి వాళ్ళో ముందు మనకు ఎలా తెలుస్తుంది? కాళ్ళ సంగతి తెలిసిపోతుందిలెండి. వాళ్ళు నిలకడగా ఒక్క క్షణం కూడా వుండలేరు. మరి, స్నానాల దగ్గిర బద్దకాలు, వాళ్ళ దగ్గిర పరిమళాల ద్వారా తెలిసిపోతాయి. ఇక అన్నల చప్పుళ్ళ సంగతి కనిపెట్టాలంటే, వాళ్ళని ఇంటికి పిల్చి అన్నాలు పెట్టాలా? ఏమో! ఈ కథలో క్రిష్ణారావు, 'అందానికే' ప్రాధాన్యత ఇస్తాననుకున్నాడు గానీ, చివరికి 'ప్రవర్తన'కే ప్రాధాన్యత ఇచ్చాడు.

29-6-2004

# అసలు కారణం!

"అన్నీ సిద్ధంచేసి వుంచమ్మా! నేను మళ్ళీ వెళ్ళి వస్తాను. ఈసారి తప్పకుండా ఇస్తాట్ళే" అంటూ గంగరాజు దగ్గరికి బయల్దేరారు మామగారు కొత్త చొక్కా కోసం.

ఆరోజు నాగులచవితి. పుట్టలో పాలుపోసే ఆచారం ఆయన చిన్నతనం నించీ పాటిస్తూ వున్నారట. నా మట్టుకు నాకీ పూజా పునస్కారాలంటే భక్తి శ్రద్ధలు లేకపోయినా మామగారి కోసం ఆరోజు చీకటితోటే లేచి, యజ్ఞం చేసినంత హడావుడి పడిపోతూ తొమ్మిది గంటల కల్లా నువ్వుల చిమ్మిలీ, బియ్యం చలిమిడీ, వడపప్పూ, కొబ్బరి ముక్కలూ తయారు చెయ్యగలిగాను. మామగారు కిందటిరోజే బజారునించి వస్తూ అరటి పళ్ళూ, సపోటా పళ్ళూ, చెరుకు ముక్కలూ, రెండు కోడిగుడ్లూ తెచ్చుకున్నారు. అన్నట్టు పుట్టమీద పెట్టి తర్వాత కట్టుకోటానికి ఒక గళ్ళపంచె కూడానూ. ఆవుపాలు కాఫీలకు ముందే వేరే వెండి చెంబులోకి

తియ్యమన్నారు. అవన్నీ సిద్ధం చేస్తోంటే, బువ్వాలాటలాడుకునే పిల్లలకి కందిపప్పూ బెల్లం ముక్కా ఇచ్చి వాళ్ళ సరదా తీరుస్తోన్నట్టే అన్పించింది.

అన్నీ సిద్ధంగానే వున్నాయి. వేరే సిద్ధం చేసేదేమిటి? వచ్చిన గోలంతా మిషను గంగరాజుతోనే. కొత్త బట్టలు కట్టుకుని పుట్టలో పాలు పొయ్యటం మామగారి ఆచారం.

గంగరాజు ఇంత ఏడిపిస్తాడనుకోలేదు మొదట. అసలు నేను నెల్లాళ్ళ కిందటినించే పాట ప్రారంభించాను. "దీపావళి వచ్చేస్తోంది. దాని వెనకాలే మీ నాగులచవితీ వచ్చేస్తుంది. తొందరగా కొత్త గుడ్డలవీ తీయించుకోండి" అంటూ.

"మంచి ఖద్దరు లేదమ్మా కొట్లో. వారం రోజుల్లో వస్తుందన్నాడు. నా ఒక్కడి చొక్కా భాగ్యానికి ఆలశ్యం అవుతుందా?" అంటూ మామగారుకూడా పాడుతూనే గడిపారు.

తీరా ఆయనకి నచ్చే మంచిఖద్దరు కొట్లోకి వచ్చేటప్పటికి పదిహేను రోజులు దాటింది. పంచే, చొక్కా గుడ్డా తెచ్చుకుంటే నేనూ చూశాను. ఆ ఖద్దరు మంచేవిటో నాకేం అర్థం కాకపోయినా చాలా బాగుందన్నాను. ఆ సాయంత్రం చొక్కాగుడ్డ తీసికెళ్ళి గంగరాజు కొట్లో ఇచ్చి వచ్చారు. అప్పటికి దీపావళి పదిరోజులే వుంది.

మూడో రోజు అలా బజారుకేసి వెళ్తూ ఒకసారి గంగరాజు కొట్లోకి తొంగిచూస్తే "చొక్కా కోసమా తాతగారూ? ఇ .... హి .... హి .... కుట్టలేదండీ!" అన్నాడట గంగరాజు.

"తొందరేముంది లేవోయ్. దీపావళి నాటికి గదా? తాపీగా కుట్టియ్యి" అన్నానని చెప్పారు ఇంటికొస్తూనే.

"అయ్యో! అలా ఎందుకన్నారు? మనం కంగారు పెట్టకపోతే వాళ్ళసలే అశ్రద్ధ చేస్తారు" అన్నాను.

"అబ్బే! మన గంగరాజు అలాంటివాడు కాదమ్మా! అలా చెయ్యడు."

ఎవర్ని గురించి మాట్లాడినా, వాడు మనవాడే అనుకోడం, వాడు అలా చెయ్యడనుకోడం ఆయనకెప్పుడూ అలవాటే.

రెండు రోజులు పోయాక కాబోలు చొక్కాకోసం మళ్ళీ వెళ్ళి వచ్చారు.

"పండుగ రోజులేమో, గుడ్డలు తెగవచ్చి పడుతున్నాయి. నిండా పనితో మునిగి సతమతమౌతున్నాడు పాపం!" అనుకుంటూ, గంగరాజు మీద జాలిపడుతూ వచ్చారు.

"సరేలెండి! ఎప్పుడిస్తానన్నాడు?"

"ఆ, వాడే ఇస్తాళ్ళే, చవితి నాటికి ఇవ్వక పోతాడా?"

"చవితి నాటికేవిటి? దీపావళి నాటికే ఇమ్మన్నారుగా?"

"అన్నానులే. వాడే ఇస్తాడు. దీపావళికి ఇచ్చినా దాన్ని చవితికే తొడుక్కుంటాను."

"దీపావళికే ఇమ్మని అడగండి. లేకపోతే ఆలస్యం చేస్తాడు."

"అలాగేలే. పండక్కి ఇవ్వాలని అతనికీ తెలుసుగా?"

చెప్పొద్దూ, నేనూ వూరుకున్నాను. మామూలు చొక్కా ఎంతసేపు కుట్టాలీ? దానికేం షోకులా, ఫేషన్లా?

దీపావళి రెండు రోజుల్లో కొచ్చింది. చొక్కా మాట జ్ఞాపకం చేస్తే మధ్యాన్నం వెళ్ళి వచ్చారు.

"పండుగనాడు పొద్దున్నకి తప్పకుండా ఇచ్చేస్తానన్నాడమ్మా? పోనీలే వాడే ఇస్తాడు" అన్నారు.

"బాగుంది. ఇలా చేస్తున్నాడేవిటి!" అన్నాను కోపంగానే.

తర్వాత మా నానితో కూడా చెప్పాను. "నువ్వు అప్పుడప్పుడూ గంగరాజు కొట్టు దగ్గిరికి వెళ్ళి తాతయ్య చొక్కా ఇమ్మని అడుగుతూ వుండు" అని.

ఇలా చెప్పానో లేదో వాడు అలా పరిగెత్తాడు.

"ఆరేళ్ళవాడు బజార్లో పరిగెడితే ఇంకేమైనా వుందా? బళ్ళూ .... సైకిళ్ళూ .... పసివెధవని పంపిస్తావా? నే తెచ్చుకోనూ?" అంటూ మామగారు నన్ను కేకలేసి పిల్లాడి వెనకాల బైల్దేరారు.

పొద్దుబోయే వేళకి ఇద్దరూ కలిసి వచ్చారు పొట్లాం పట్టుకుని.

"హమ్మయ్య" అనుకున్నాను.

నానిగాడు పొట్లాం విప్పుకుంటూ "అమ్మా! గంగరాజిచ్చేడే. గంగరాజిచ్చేడే" అంటూ గంతులెయ్యటం మొదలెట్టాడు. తీరా చూస్తే ఓ బండెడు గుడ్డముక్కలు తెల్లవీ, ఎఱ్ఱవీ, పచ్చవీ, నల్లవీ, ఇవీ, అవీ!

"ఇదేమిటి? చొక్కా అనుకున్నాను. చొక్కా ఇవ్వనే లేదూ?"

"ఇస్తానన్నాడే"

"ఎప్పుడూ?"

"కుట్టింతర్వాత"

"ఎప్పుడా కుట్టడం?"

"పండగనాడిచ్చేస్తానన్నాడమ్మా!"

నేలన పోయేది నెత్తిన రాసుకున్నట్టయింది. చొక్కా తేలేదు సరిగదా, ఇంటినిండా గుడ్డముక్కలు ఎగరెయ్యటం మొదలెట్టాడు పిల్లాడు.

పండగ రానే వచ్చింది. పొద్దున్నే ఫలహారం అదీ అయ్యాక గంగరాజుకోసం అరడజను మతాబాలు కూడా పట్టుకుని బయల్దేరారు మామగారు.

అరగంట లోపలే తిరిగి వచ్చారు ఉత్తచేతుల్తో! "దీపాల వేళకి ఇచ్చేస్తానన్నాడమ్మా! ఇంకా కుట్టలేదని దేవుళ్ళాడాడు. బోలెడు పని పాపం!"

నేను ఆశ్చర్యంగా చూస్తూ అలాగే నించున్నాను. "పది రోజుల్నుంచీ ఒక్క చొక్కా కుట్టలేకపోయాడా? ఆ గుడ్డ తెచ్చెయ్యండి, మీ అబ్బాయితో ఇంకో మిషను దగ్గిరికి పంపిస్తాను. కాసిని డబ్బులు ఎక్కు విస్తే ఎవడైనా కుట్టిపెడతాడు. అలా కూర్చోటం కాదు వెళ్ళిరండి, గుడ్డ తెచ్చెయ్యండి" అని కేకలేశాను.

"ఇచ్చిన గుడ్డ తీసేసుకుంటే బాగుండదులేమ్మా!" అని ఆయన కదల్లేదు.

"వాడలా తిప్పలు పెడుతోంటే బాగుంది కాబోలు. అయినా ఇమ్మంటే మాత్రం గుడ్డ ఇచ్చే స్తాడా? అలా అడిగితే తొందరగా కుట్టిస్తాడనిగానీ!"

"అవును, బాగానే వుంది. అలాగే అడుగుతాను ఖాళీ లేకపోతే ఇచ్చెయ్యమంటాను" అంటూ మళ్ళీ వెళ్ళారు.

నేను మా ఆయన దగ్గిరికి వెళ్ళి అంతా చెప్పాను. "మీరొక్కసారి వెళ్ళి గంగరాజుని అడగరాదూ? మావ య్యకి నోట్లో నాలికే లేదు. అతనసలు లెక్కచెయ్యడం లేదు మావయ్యని" అన్నాను.

"గంగరాజుకా ఇచ్చింది? వాడికీ నాకూ మాటలే లేవు. ఎప్పుడో నా బనీన్లు పాడుచేశాడని కేకలేస్తే, అప్ప ట్నించీ వాడు బిగుసుకున్నాడు. నేను మళ్ళీ వెళ్ళలేదు" అని ఆయన మళ్ళీ పేపర్లో దూరారు.

కాస్సేపటికి మామగారూ వచ్చారు. "అడిగా నమ్మా! పాపం వాడు గుడ్డ కత్తిరించే వుంచాడు. చేతులూ, కాలరూ అన్నీ చూపించాడు. ఇక ఆ ముక్కలు తీసుకొచ్చి ఎవరికిస్తాం? సరేలే అని వచ్చేశాను" అని చెప్పుకొచ్చారు.

పండగ వంటల్లోపడి ఆ పగలంతా నేనా సంగతి మర్చేపోయాను. దీపాలవేళ ప్రమిదల్లో నూనె పోస్తూంటే చటుక్కున చొక్కామాట జ్ఞాపకం వచ్చింది.

"మామయ్యా! గంగరాజు దగ్గిరికి ...." అంటోంటే ఆయన చెప్పనే చెప్పారు. "ఇప్పుడే వెళ్ళి వస్తున్నాను. ఇంకా చేతులు అతకనే లేదు. పోనీలే. నేనేం చిన్న వాణ్ణా చితకవాణ్ణా? ఎలాగూ నాగులచవితికి కొత్త చొక్కా కావాలి. తాపీగా వాడే కుట్టిస్తాళ్ళే" అని అరుగు మీద చతికిలబడ్డారు. "దీపాలవేళ మించిపోతోం దమ్మా! తొందరగా వెలిగించు ప్రమిదలు" అంటూ కర్తవ్యం బోధించారు.

"నమ్మించి ఎంతపని చేశాడూ? మొహం వాచేలా చివాట్లేయ్యకపోయారా?" అన్నాను.

"పోనీ లేమ్మా! చొక్కా భాగ్యానికి పండగపూట వాణ్ణెందుకు చివాట్లెయ్యడం? చూస్తూనే వున్నాగా? వాడికెక్కడ తీరుబడి? ఇంకా కొట్టుకట్టి ఇంటికెళ్ళనే లేదు. పండగనాడైనా కాస్త పెందరాడే పొమ్మని నేనే కసిరి వచ్చాను" అన్నారు.

కాస్సేపు ఇటూ అటూ తిరిగి అరుగులమీద వర సగా ప్రమిదలన్నీ సర్ది దీపాలు వెలిగించాను.

తాతా మనుమళ్ళిద్దరూ అగ్గిపుల్లలూ, కాకర పువ్వొత్తులూ, మతాబాలూ కాల్చుకుంటూ ఆనం దిస్తూ కూర్చున్నారెంతోసేపు.

మర్నాడు చొక్కామాట ఎవ్వరం ఎత్తుకోలేదు.

"అమ్మా! గంగరాజు దగ్గిరకెళ్ళి తాతయ్య చొక్కా తీసుకురానా?" అన్నాడు పిల్లాడు.

"ఇహ వాడే ఇస్తాడు. ఇవ్వకేంజేస్తాడు? డబ్బుల కోసమైనా కుట్టితెస్తాడు" అన్నాను.

మామగారు నసుగుతూ చెప్పారు. "నిన్న కొట్టు దగ్గిరకొచ్చి గంగరాజు కొడుకు పేచీ పెడుతోంటే పోనీలే అని కుట్టుకూలి అర్ధరూపాయి ఇచ్చేశానమ్మా! చొక్కా తెస్తే మళ్ళీ నువ్వివ్వకు" అన్నారు.

"అయ్యయ్యో! వాడసలే ఏడిపిస్తున్నాడు గదా?

చౌక్కా ఇవ్వకుండానే డబ్బులు కూడా ఎందు కిచ్చేశారు?" అంటూ గోలపెట్టాను.

"ఎప్పుడైనా ఇచ్చేదేకదమ్మా! ఆ కుర్రవెధవ టపా కాయలలో ఏవో కొనుక్కుంటానని డబ్బులిమ్మని తండ్రి దగ్గిరికొచ్చి పేచీ పెడుతున్నాడు. వాడసలే కంగారుపడి సిల్కు పరికిణీ కుడుతుంటే ఆ కుట్టు సాగనివ్వకుండా చేస్తున్నాడు. సరేలే అని డబ్బు లిచ్చేశాను"

"ఛ! ఆ గంగరాజు ఆ మంచితనం అన్నా గ్రహించాడా?"

"అఁ, మంచే వుందిలే. రేపైనా ఇవ్వాల్సిందేగా? వాడికి పాపం ఊపిరి తీసుకోటానిక్కూడా తీరిక లేదమ్మా!"

గంగరాజుకి ఆ తీరిక లేకపోవటం లేకపోవటం, నాగుల చవితి దాకా లేకపోవటమే అయింది.

"చీకటితోటే పంపించేస్తాను తాతగారూ! మీరు మళ్ళీ రావద్దు. శ్రమపడి తిరగమాకండి" అన్నాడట ఆ క్రితం రోజు.

"పాపం, వాడుకూడా ఇదవుతున్నాడమ్మా!" అన్నారు మామగారు.

తొమ్మిది గంటల పొద్దెక్కినా చొక్కా పంపించ లేదు గంగరాజు.

"నే వెళ్ళొస్తాను. ఈసారి తప్పకుండా ఇస్తాళ్ళే. అన్నీ సిద్ధం చేసి వుంచమ్మా!" అంటూ మళ్ళీ కొట్టుకి బయ ల్దేరారు మామగారు.

"ఈసారైనా ఇవ్వకపోతే ఇక తాతగారి మొహం ఎలా చూస్తాడు?" అనుకున్నా.

పళ్ళూ, ప్రసాదాలూ, ఆవుపాలూ అన్నీ బుట్టలో సర్ది వుంచాను.

మామగారు వచ్చేశారు, ఉత్తచేతుల్తో! "కొట్టు తియ్యనేలేదమ్మా! నేనే మర్చిపోయాను. నిన్నే చెప్పాడు, ఇంటి దగ్గిరే కుట్టి పంపిస్తానన్నాడు. అంతా అయిందంట. గుండీలే కుట్టాలన్నాడు."

"గంగరాజు కన్పించనే లేదా?"

"అబ్బే, లేదు. వాళ్ళంతా పుట్టలో పాలుపోస్తారు కావున్ను. వాళ్ళ చంటిదానికి చెవిలో పోటుపుడితే మొక్కుకున్నామని ఎప్పుడో అన్నాళ్ళే. ఆ హడావుడిలో చొక్కా పంపడం మర్చిపోయాడో యేమో!"

ఇదేం మనిషి! ఇంత శాంతం! ఇన్ని రోజుల్నించీ తిప్పుతూ వుంటే వీసమెత్తన్నా కోపం రాదేం అతని మీద?

"మరి కొత్త గుడ్డల్తో పుట్టలో పాలు పొయ్యాలని మీ నమ్మకంగా మావయ్యా? ఏం చేస్తారిప్పుడు?"

"అఁ, ఏ వుంది లేమ్మా? ఎల్లకాలం ఒక్కలాగే నడుస్తుందా? ఈ ఏడాదికి ఎలాగో జరుగుతుందిలే. కొత్త అంగోస్త్రం వుందిగా? భుజాల చుట్టూ కప్పుకు వెళ్తాను ఏదీ? అన్నీ సర్దిపెట్టావా? అన్నట్టు చెప్పటం మర్చిపోయాను. రెండు అగరొత్తులు కూడా పెట్టు. ఏడీ, నానీ ఏడీ?" అంటూ ఎండెక్కిపోతోందని కంగారు పడ్డారు. రెండు చెంబుల నీళ్ళు మళ్ళీ దిమ్మ రించుకుని, కొత్త పంచె కట్టుకున్నారు. బోసి ఒంటి మీద కొత్త తుండు కప్పుకున్నారు. ప్రసాదాల బుట్ట పట్టుకుని, మనవడి చెయ్యి అందుకుని నెమ్మదిగా ఇల్లుదాటి వెళ్ళిపోయారు.

తిరిగి వస్తూ "నేను చెప్పాను కదమ్మా! గంగరాజు కన్పించాడు, పుట్టలో పాలుపోసి వస్తున్నాడు. పిల్లా జెల్లా అందరూ కలిసే వెళ్ళారు. చెవిలో పోటు తగ్గి చంటిది కులసాగానే వుందట. ఇదిగో, ప్రసాదం కూడా ఇచ్చాడు. కొంచెం నీ నోట్లో వేసుకో" అంటూ పళ్ళెం అందించారు.

నాకు వొళ్ళుమండింది. "ఇచ్చాళ్ళెండి ప్ర .... సా .... దం. అసలు ఎందుకు తీసుకున్నారు మీరు?" అని కేకలేశాను.

ఇక చొక్కామాట మరిచేపోయాం.

ఆ సాయంత్రం గంగరాజే వూడిపడ్డాడు చొక్కా పట్టుకుని.

అన్నాళ్ళూ నా కోపాన్ని ఎలా అణుచుకున్నానోగానీ గంగరాజుని చూసీ చూడగానే బాగా పోట్లాడాను.

"అయితే గంగరాజూ! ఇలా చేస్తావా?" అంటూ ప్రారంభించి ముక్కూ మొహం వాచేలాగా చివాట్లు పెట్టాను.

అన్నిటికీ ఒక్కటే సమాధానం 'ఇహి .... హి ....' అంటూ ఇకిలింపు. ఆఖరికి ఒక్క ముక్క అన్నాడు. "ఇహి .... హి .... ఖద్దరు చొక్కాయే కదమ్మా! ఇహి హి!"

['కరుణామయి' మాసపత్రికలో1970 కన్నా ముందుకావచ్చు.] ★